# ఓ పిట్టకథ

ఉదయమే సూర్యకిరణాలు చెట్లమీద, గుట్టలమీద, పొదలమీద పర్చుకోగా అంతటా పలుచని బంగారు వన్నె పరుచుకుంది. లేత ఎండకు పక్షులు నులివెచ్చని గాలిలోకి ఎగిరిపోతూ శబ్దాలు చేస్తున్నాయి. తూనీగలు, సీతాకొక చిలుకలు ఒక ఆకు నుండి మరొక ఆకు మీదికి ఎగురుతున్నాయి.

ఊరివైపు మళ్ళి ఊళ్లోకి తొంగిచూస్తే పొద్దున్నే వదిలిన కోళ్లు పెంటదిబ్బెల మీద గూడు పెదుతూ వున్నాయి. కుక్కలు ఇంకా అక్కడక్కడ కునుకు తీస్తున్నాయి. చెట్లమీది కొంగలు ఎప్పుడో ఎగిరిపోయి చెరువులను చేరాయి. కాకులు మాత్రం కావుకావుమంటు ఊళ్లోనే తిరుగుతున్నాయి. వాటి అరుపుల్లో ఏదో ఓ మాదిరి మార్పు వినిపిస్తుంది. ఎందుకు ఈ మార్పు చోటు చేసుకుందో ఆలోచించాల్సివుంది.

ఆకలేసిన ఓ కాకి అరుస్తూ ఊరంతా తిరిగింది. ఎక్కడ ఏం కనిపించలేదు. ఆకలితోనూ, అవమానంతోనూ చెట్టుమీద వాలి చుట్టూ చూస్తూ వుంది. కల్లాలు అయి చాలా రోజులైంది. వాటి చుట్టు ధాన్యపు గింజలు కనిపించలేదు. కాకి ఇండ్లమీద ఎగురుతూ, ఇండ్ల ముందటి చెట్లమీద వాలుతూ ఊరును, ఊరి వాలకాన్ని చూస్తువుంది. కొన్ని ఇళ్లకు ముందూ, వెనక ఖాళీ స్థలాలు లేవు. మరికొన్ని ఇండ్ల ముందు ఏ చెట్లు లేవు. తనకు తెలిసినంతవరకు, తాను చూసినంత వరకు గతంలో ఊరినిండా చెట్లువుండేవి. ఊరి పక్కన వృక్షాలుండేవి. పొద్దుగూకగానే కొంగలు, ఇంకా తమ జాతివాళ్ళు కావు కావుమంటు వాలేవి. ఇంకా ఇతర పక్షులు కూడా చేరేవి. కాకి ఇలా ఆలోచిస్తున్నప్పుడు ఓ ఊర పిచ్చుక వచ్చి పక్కకొమ్మమీద వాలింది. దాని వెనకాల ఓ పెంటి పిచ్చుక వచ్చివాలింది.

"ఏమోయి నీవు ఇలా వస్తివి. నీ స్థావరం ఇది కాదు కదా" అంది.

"అది ఒకప్పటి మాట. ఇప్పుడు మనందరి స్థావరాలు ఈ చెట్లే. నీవనుకుంటున్నట్లు మా స్థావరాలు చేదబావులు, ఊరబావులే, కాని ఇప్పుడా బావులేవి? ఎప్పుడో పూడిపోయినయి. ఇప్పుడు ఎవరైనా ఏ బావినైనా

తప్పుతున్నారా? ఒకవేళ తొవ్వినా నీళ్ళు పడుతున్నాయా? నీళ్ళకు దూరంగా మా జాతి వుండలేదు గదా? అంతేకాదు ఊరిని వదిలి కూడా వుండలేవు కదా?" అంది మగ ఊరపిచ్చుక.

"ఆ విషయం నీ పేర్లలోనే వుంది గదా" అంది కాకి.

ఈ లోపల కొంగ ఓటి తొంగిచూసి "ఇద్దరు తీరికగా ముచ్చటించుతున్నారే" అంది.

"ఎంతైనా బామ్మర్ది కదా కాసేపు సరదాగా మాట్లాడుకుంటున్నాం" అంది కాకి.

"నేను నీకు బామ్మర్దిని ఎట్లా అవుతాను" అంది మగ ఊరపిచ్చుక.

"చెప్పవోయి కొంగ బావ" అంది కాకి.

"బలిసినోడికి బక్కోడు బామ్మర్దియే కదా" అంది కొంగ వ్యంగ్యంగా.

"బామ్మర్ది ఏమిటో నాకర్థం కాదు. ఈ మనుషులు అటు ఇటు కాని వరుసలు పెట్టుకుంటరు. అటు బావ కాదు ఇటు మరిది కాదు. మనుషుల్లో ఆడవాళ్ళు నయం బావన్న అంటరు, మరిదన్న అంటరు. కాని బామ్మర్ది అనరు. మగవాళ్ళే అట్లా అంటారు. అటు ఇటు కాని కొజ్జ పదం బామ్మర్ది" అంది మగ పిచ్చుక ఎగిరిపోతూ.

"పిట్ట కొంచెం కూత ఘనం ఈకంత లేదు వావి వరుసల భోగట్టా చెపుతుంది." అంది కాకి పిచ్చుక పోయిన వైపు చూస్తూ.

"వరుసలొాదలండి, సరసంగా ఉంటే చాలు. మా వాళ్ళంతా వెళ్లారు. నేను చెరువుకు వెళ్ళాలి" అంటూ ఎగిరిపోయింది కొంగ.

"ఈ కొంగ ఎప్పుడు ఇంతే రాజకీయ నాయకుల్లాగ" అంది పిచ్చుక.

"నీవు పోవైతివి?" అంది కాకి పెంటి పిచ్చుకతో.

"మగ ఊరపిచ్చుకతో పోతె ఊర్కె సతాయిస్తాడు. మీతో కాసేపు వుందామని".

"ఎటు పోదాం" అంది కాకి.

"పెద్దదానివి నువ్వే చెప్పాలి" అంది పిచ్చుక.

"ఏం పెద్దో ఏమో నా రంగు, నా చప్పుడు విని ఎవరు వొట్టి చేయితోనే విదిలిస్తూవుంటరు. నీవే నయం మెల్లగా వెళ్ళి పొట్ట నింపుకుంటవు" అంది కాకి.

"ఇన్నాళ్ల కాలం కాదు. ఆ రోజుల్లో జనం ధాన్యాన్ని వాకిట్లో ఎండపోసేవాళ్లు. పొద్దుందాక బుక్కేది. అట్లా రోజుకో ధాన్యాన్ని ఎండపోసేవాళ్ళు. ఇప్పుడు లేదు. కల్లం రోజు తప్ప మరుసటి రోజు గింజ కూడా కనపడడంలేదు." అంది పిచ్చుక.

"నిజమే. ఆ పంటలు ఇప్పుడు లేనేలేవు. ఎవరు చూదు పత్తి, మిర్చి, పొగాకు, ఇగ తండల వైపు పోతె ఓమా, ధనియాలు, గంజాయి పండించడం. ఇట్లా అయిపోయింది కాలం" అంది కాకి.

"జొన్నలు-సజ్జల మాటేలేదు కాకపోతే ఆముదాలు" అంది పిచ్చుక.

"సరే ఎటన్న పోదాంపద" అంది కాకి.

"ఇల్లిల్లు తిరిగేదానివి, నీవే చెప్పాలి." అంది పిచ్చుక.

"ఎంగిలి చేయి విదిలించని ఇళ్ళకు వెళితే ఏం లాభం?" కాకి అనుభవాన్ని చెప్పింది.

"సావుకారి ఇంటికిపోతే" అంది పిచ్చుక.

రెండూ ఎగిరివెళ్ళి సావుకారి ఇంటిపై వాలి, చుట్టూ చూస్తున్నయి.

"ఆ ఇంట్లో ఎరువుల బస్తాలు, ఉప్పు బస్తాలు, చింతపండు, నూనె పీపాలు, కనిపించాయి. అంతేకాదు వాకిట్లో ఎండపోసిన మిర్చి, వసారలో ఆరబోసిన వుల్లిగడ్డలు కనిపించాయి. బెల్లంముద్దలు వున్నా వాటి మీద గోనె సంచులను కప్పివుంచారు." అంది కాకి నోటికి అందని వస్తువుల వైపు చూస్తూ.

'అయినా వీనింట్లో ఏదీ ముట్టొద్దు. అన్నిటినీ కల్తి చేస్తడు' అనుకుంటూ దొరోరి ఇంటివైపు వెళ్ళి ఇంటిముందటి వేపచెట్టు మీద వాలినయి. ఇంటి వెనుక పత్తిని బేళ్ళు కడుతున్నారు. ఇంటి ముందు ఆముదపు కాయలను ఎండపోసారు ఇవి తప్ప అక్కడ ఏమీ కనిపించలేదు. పెరట్లో నారుకోసం పోసిన వడ్లమండె కనిపించింది.

"పద మండె మీద వాలుదాం" అంది కాకి.

"వద్దు. వాటిని మందు నీళ్ళలో నానపోసినాలె. వాటిని తింటే మనం అయిపోతం" అంది పిచ్చుక.

"ఒహో అవును నిజమే" అంది కాకి.

ఏమి దొరకనందుకు వాకిట్లో రెట్టవేసింది కాకి.

"కూలీల వాడకు పోదామా అంది" కాకి మళ్ళీ తానె.

"ఆ వాడల్లో మాత్రం ఏముంది. పొద్దంతా పనిచేస్తే పైసలే ఇస్తున్నరు. ఎవరన్న ధాన్యం కొలిస్తే మూటగ తెచ్చుకొని ఇంట్లో కుండల్లో పోసుకుంటున్నరు. నీ సంగతి పోనీ, నాకు కూడ ఓ బియ్యపు గింజ దొరకటం లేదు" అంది పిచ్చుక ఊసురుమంటూ.

"పద ముందుకు పోదాం" అంది కాకి.

ఆ రెండు పక్షులు ఎగిరి నడి ఊళ్లో వెళుతూ ఓ గౌడు ఇంటిమీద వాలి చుట్టూ చూశాయి. పాకలో కల్లు పొంగులు పొంగుతూ వుంది. పక్కనే చెట్టు కింద బట్టి నుండి సారా తీస్తున్నరు. క్యానుల్లో నింపిన సార గుప్పున వాసన వస్తూవుంది.

"ఇక్కడ ఆగితిమా మనకు ఏదో ఓటి తాగాలనిపిస్తుంది. తాగితిమా ఇంతే సంగతులు సుమా. పద, ముందుకు పోదాం" అంది పిచ్చుక.

"ఏం కాదు కాస్తంత కల్లు తాగుదాం. వనంలో అప్పుడప్పుడు తాగుతనేవుంటా" అంది.

"సామి వనంలోని కల్లు వేరు, ఊరు చేరినంక కల్లు వేరు. మందు, మాకు కలుపుతరు. దానిని తాగితే చావనన్న చావచ్చు. లేదా చూపు తగ్గి గుడ్డి పక్షులం

కావచ్చు. వద్దు సామి వద్దు నా మాట విను. బతుకుంటె బలుసాకు తినొచ్చు" అంది పిచ్చుక.

"అవును, స్వామి ఏంది స్వామి నాకేదో కొత్త పేరు తగిలించినవ్" అంది కాకి.

"ఈ మధ్య మనుషులు నల్లగుడ్డలేసుకొని తిరుగుతున్నరు. రోజు పొద్దున, సాయంత్రం నీలాగే నీళ్లలో మునిగివస్తరు. ఏదో ఓ చోట గుంపులుగా తింటున్నరు. ఒకరికి ఒకరు ఎదురైతే స్వామి అంటె స్వామి అని పిలిపించుకుంటున్నరు. నీవు వాళ్లున్నట్టే వున్నావు కనుక స్వామి అంటున్న" అంది పిచ్చుక నవ్వుముఖంతో.

"అబ్బా పొట్టి దానికి పుట్టెడు బుద్ధులని ఊరికే అనలేదు, సరే కానీ" అంది కాకి.

"ఇక పద" అంటూ అక్కడినుండి ఎగిరి ముందుకు సాగినయి.

ఊరిపక్కెమ్మటె ఉన్న వేప చెట్టుమీద వాలినయి. అదే చెట్టుకింద జనం కల్లు సార సాగలు పెడుతున్నరు.

"ఊళ్లో జనానికి జ్వరాలు వచ్చాయట అందుకని ఆ సాగలు అని అక్కడికి వచ్చిపోయే జనం అనుకుంటున్నరు" అంది కాకి.

"మనుషులకు జ్వరాలు వస్తే రాళ్ళకు సాగలెందుకో"

"అదంతే. నన్నేమో పిట్ట ధమాక్ అని గేలిచేస్తరు. వాళ్ళేమో ధమాక్‌లేని పనిచేస్తుంటరు".

"మనుషుల మాటలే అంత. తమకి లేకుంటే ఇక ఎవరికి ఏముండదు అనుకుంటరు"_అంది పిచ్చుక.

"ఈ మనుషుల సంగతి నాకర్థం కాదు పొద్దంతా కూలినాలి చేస్తరు, పొద్దూకంగా తాగొస్తరు" అంది కాకి.

"ఇప్పుడు పనిపాటలూ గూడ తగ్గిపోయినయి. తొవ్వుడు లేదు, ఎత్తుడు లేదు. అన్ని పనులు మిషన్లే చేస్తున్నయి. రోజుకూలి పోయింది. బతికే ఆలోచన మాని చెట్లకింద చింతగింజల ఆట ఆడుతున్నరు. పిచ్చోళ్ళు" అంది పిచ్చుక.

"చూస్తూనే వున్న ఏమంటం? వాళ్ళంతే, పనిచేసే బుద్ధి సన్నగల్లింది" అంది కాకి.

"మనం మైళ్ళ కొద్దీ తిరిగినా పొట్టనిండదు" అంది పిచ్చుక.

అంతలోనే గాలొచ్చి చెట్ల కొమ్మలు ఊగిసలాడినయి. పక్షులు రెండు కాస్త కదిలి కొమ్మలను గట్టిగ పట్టుకుని కూర్చున్నయి.

"వీళ్ళు మాత్రం కింద మీదపడి కూర్చున్నచోటే పూట ఎల్లదీసుకుంటరు" అంది పిచ్చుక.

"మనం మాట్లాడుకుంటూ తిరుగుతున్నం, ఎక్కడా ఏమి కనపడడం లేదు" అంది కాకి.

"పండగల రోజులు కావు, కల్లాల రోజులు కావు. తిరగక తప్పదు" అంది పిచ్చుక.

"అదిగో, చూడు చెరువు వైపు. అక్కడ పిలక జుట్టాయన ఏమో చేస్తుండు." అంది కాకి.

"ఏదో పిండాలు వదులుతున్నట్టుంది. మనం వెళ్ళే సరికి మునిగిపోతయి" అంది పిచ్చుక.

"చుట్టూ చూడు, అక్కడ ఎక్కడో ఏవో గింజలతో ఏదో రాసి వుంటాడు" అంది కాకి.

రెండు పక్షులు కలిసి తిరిగాయి. చెరువు పక్కన వున్న చెట్టుకింద పిలక జుట్టాయన రాసిన గింజలను కనుక్కున్నయి. కాని వాటి మీద అప్పటికే పసుపు, కుంకుమ జల్లివుంది.

"వాటిని తినొద్దు స్వామి" అంది పిచ్చుక.

"మరి చీమలు మోసుకుపోతున్నయి. వాటికి ఏంకాంది మనకేమైతది" అంది కాకి.

అప్పటికే చీమలు సగానికంటే ఎక్కువ మోసాయి. తమకంటే ముందే అవి ఆ పని చేసినందుకు మనసులోనో తిట్టుకున్నయి. ఆ పూట గడిచినందుకు సంబరపడ్డయి. అప్పుడే అక్కడినుండి వెడుతున్న ఓ మగ పిచ్చుక ఈ పిచ్చుకను చూసి ఆగింది. అది చూసిన కాకి.

"కాసేపు మాట్లాడుకోండి, నేనిట్ల చెరువులో మునిగి వస్తాను" అంది కాకి.

"నీవు ఎందుకు పోతున్నావో నాకు తెలుసు. ఒంటరిగా దొరికిన గదా వాడు ఓ బంగీన ఇక వదలడని" అంది పిచ్చుక సిగ్గును ప్రదర్శిస్తూ.

"అట్లాంటి అవకాశం మాకు లేదు" అంటూ కొంత సిగ్గును, కొంత కొంటెతనాన్ని ప్రదర్శిస్తూ ఎగిరిపోయింది కాకి.

00

కాకి చెరువు వైపు వెళుతూవుంది. ఊరి చివర వేపచెట్టు కింది ఇంటి ముందు జనం గుమిగూడి వున్నారు. అందరి ముఖాలలో విషాదం. ఆ ఇంటిముందు పాడెను కట్టి వుంచారు. ఇంటి లోపలి శవాన్ని పాడె మీదికి తెస్తూవున్నారు. కాసేపు చెట్టుమీద కూర్చొని చూసింది కాకి. ఆ ఇంటి వ్యక్తి తనకు తెలుసు. ఆయన బట్టలు నేయడానికి ఇంటిముందు పడుగుకు గంజి అద్దుతూవుంటే తాను గంజి కుండమీద వాలి మెతుకులను ఏరుక తినేది. ఈ మధ్యనే గంజికి బదులు ఏదో పౌడర్ వాడడం వల్లా ఇటు తన రాకపోకలు తగ్గినయి.

నాకు తెలిసినంతవరకు మొదట బాగానే బతికేవాడు. భార్యాపిల్లలు పొద్దంతా పనిచేసి బట్టలు నేసేవారు. నేతపనిలో ఒకేసారి మార్పు వచ్చింది. మామూలు బట్ట నుండి మంచి బట్టల వరకు మిషన్లే తయారు చేస్తున్నాయి. ఏ వూరి జనం ఆ వూళ్ళో లేదా చుట్టుపట్టు ఊళ్ళలో నేయించుకునేది తగ్గిపోయి అందరు కొట్లల్లో మిల్లు బట్టలను తెచ్చుకుంటున్నారు. చివరికి శవంమీద కప్పేగుడ్డ కూడా మిల్లుదే కొనుక్కొస్తు వున్నారు. బతుకంతా గుడ్డలు నేస్తే తన శవానికే గుడ్డ కరువైంది. పోగా నేత గుడ్డలకు గిరాకి తగ్గింది. రోజురోజుకూ పనిలేకుంట పోతుంది.

పూట గడవక భార్య చావనైంది. వాడిపోయిన బెండకాయల్లాగా వాళ్ళ పిల్లలు, కూలడానికి సిద్ధమైన ఆ ఇల్లు. వీళ్ళ బతుకులు ఎట్లా గట్టెక్కుతాయో అని అనుకోకుండా అరిచాను. అందరూ ఒక్కసారిగా నావైపు చూసారు.

అందులో ఒకరు "ఇంకా చుట్టాలు వస్తున్నట్టుంది. అదిగో కాకి అరుస్తూంది" అన్నాడు.

మనుషులకు నా మీద ఎంత గురో అనుకుంటు ఎప్పుడో పై కొమ్మల్లో పెట్టిన గూడువైపు చూసింది. అది గాలి వానకు చెదిరిపోయింది. దానిని చూడగానే పాత జ్ఞాపకాలు గుర్తొచ్చాయి. ఒక రోజు గూటిలో ఓ గుడ్డుపెట్టి, మేతకెల్లి వచ్చేసరికి దాని పక్కనే మరో గుడ్డు వుంది. ఎక్కడిదబ్బా ఈ గుడ్డు అని ఆలోచించాను. సరే గుడ్డేకద అని సరిపెట్టుకున్నాను. మరునాడు అలాగే జరిగింది. పోని అని ఊరుకున్నాను. అన్ని గుడ్లనూ పొదగగా పిల్లలు అయినయి. వాటిలో రెండు పిల్లలు రంగులో అంత తేడా లేకపోయినా అరుపు ద్వారా గుర్తుపట్టాను. మొదట కొంచెం కోపము వచ్చింది. కాని పొదిగిన ప్రేమ కోపాన్ని జయించింది. నా పిల్లలతో పాటు వాటికి మేతపెట్టి రెక్కలొచ్చేవరకు పెంచాను. కాని గుడ్డు పెట్టిన తల్లికి పట్టింపు వుండదా? మనుషుల్లోనూ ఇలాంటి వాళ్ళుంటారని ఆ తరువాత తెలిసింది. ఉన్నవాళ్లు లేని వాళ్ళని, అగ్రకులాలు, దళిత కులాలని. దళితులు మాత్రం బతికినంత కాలం ఉన్నత వర్గాలవారికి చాకిరి చేస్తనే వుంటారు. ఆ తరువాత అంటుకోకూడదని అవమాన పరుస్తారు. బతుకంతా చాకిరి చేయించుకొని బట్ట-పొట్టకు చంపుతారు. మనుషుల్లో ఈ వివక్ష మా కాకుల్లో మాత్రం లేదు. మనుషులు పక్కింటోన్ని నరికి చంపుతుంటే పారిపోయి తలుపులు వేసుకుంటరు. అదె ఎవరైన మాలో ఓ కాకిని కొట్టమను అంతే ఒక్క అరుపు అరిస్తే చాలు మా బలగమంతా చేరి వాన్ని పొడిచి పొడిచి, తన్ని తన్ని చంపేస్తయి. అందుకే మాకు కాకి బలగమనిపేరు. ఒక కొమ్మమీద ఒక కాకి గూడుకట్టుకుంటె మరొక కాకి అటువైపు చూడదు. కాని మనుషులు ఒకరి ఇల్లును మరొకరు, ఒక మతపోని గుడిని మరొక మతపోడు కూలగొట్టడం, మనిషిని మనిషి వెంటాడి చంపుకోవటం! ఏంటో మనుషుల సంగతి అని ఆలోచిస్తున్నప్పుడే- "గోవిందా" అని చప్పుడొచ్చింది. అటువైపు చూశాను. పీనుగను లేపారు. నేను అక్కడినుండి లేచాను.

అట్లా చెరువుకు పోయి, రెండు మూడుసార్ల నీటిలో మునిగి గట్టుకొచ్చాను. గట్టున కొంగ బావ కళ్ళు మూసుకుని ఒంటి కాలుమీద నిలుచున్నాడు. నేనెగురుతూ వెళ్ళి ఎదురుగా నిలుచున్నాను. అయినా కళ్ళు తెరిచి చూడలేదు. తన వెనుక ఓ కప్ప నీటిలోకి దూకింది. వెంటనే కళ్ళు తెరిచింది. సరిగ్గా అప్పుడే ఓ చేపపిల్ల నీటిపైకి ఎగిరింది అమాయకంగా. అంతే కొంగ దాన్ని పైది పైన్నే

అందుకుంది. మళ్ళీ కళ్లు మూసుకుని ఏమెరుగనట్టు నిలుచుంది. దీనినే కాబోలు కొంగ జపం అంటారేమో!

"కొంగబావ ఇంతమోసం బాగుండదు సుమా" అంది కాకి.

కొంగ మరొకసారి కన్నుమూసి తెరిచింది అంతె ఏం మాట్లాడలేదు.

ఒక్కొక్కసారి మనుషులు, మనుషుల్లోని దొంగస్వాములు, వాళ్లు నమ్మించి చేసే మోసాలు. బంగారాన్ని చేసి ఇస్తామని ఉన్న బంగారాన్ని ఎత్తుకపోవడం, మహిమతో సంతాన ప్రాప్తి కలిగిస్తానని మానభంగాలు చేయడం జరుగుతూవుంటది. ఈ జపం చేయడమే ఓ పెద్ద మోసం. ఆ దొంగ జపం చేస్తుంది కొంగ. కంటబడ్డ పరుక పిల్లలను, కప్ప పిల్లలను కాజేస్తుంది. అసలు అవి దాని కంటపడకుండా ఉంటేనే మంచిది. ఇట్లా ఆలోచిస్తున్నప్పుడు కాకికి పిచ్చుక గురించి గుర్తొచ్చింది. అటువైపు ఎగిరిపోయింది.

కాకి పిచ్చుకను సమీపించి "అరె అప్పుడే వెళ్ళిపోయాడా మీ జతగాడు" అని అడిగింది.

"నీ వొచ్చేది చూసి పాయె" అంది కాస్త సిగ్గుగా.

"ఆ జుట్టును సరిచేసుకో చిందర వందరగా వుంది" అని చెప్పి కాసేపు తన జ్ఞాపకాలను నెమరువేసుకుంది. ఆ తరువాత "గుట్ట పక్కన జొన్నచేను వేశారట పద" అంది కాకి.

"అమ్మో మంచెమీద వడిసేలవాడుంటె దెబ్బకు చంపేస్తడు" అంది పిచ్చుక.

"పోయైతే చూద్దాంపద" అంది కాకి.

రెండు పక్షులు ఎగిరి గుట్టవైపు వెళ్ళాయి. కాని ఊరి అవతల గుట్టలేదు. ఆఖరకి గుండ్లు కూడా లేవు. రాతి బెచ్చకుప్పలు తప్ప.

"గుట్టేమైంది" అని అడిగింది పిచ్చుక.

"నీవు ఇటురాక ఎన్నాళ్లైంది".

"చాలా రోజులైంది. ఊళ్లో తప్ప ఊరవతల నాకేంపని స్వామి" అంది పిచ్చుక.

"అవునులే నీ పేరే ఊరపిచ్చుకాయె" మరొకసారి అంటూ నవ్వింది కాకి.

"సరెకాని గుట్టేమందో" అని మళ్లి అడిగింది పిచ్చుక.

"పట్నం వాళ్ళు గుండ్లన్నింటిని క్రేన్‌లతో కదిలించి నాలుగు పక్కలు చెక్కి లారీలలోకి ఎత్తి తీసుకపోయింద్రట. అక్కడికి పోయినంక రంపెలతోటి పలకలుగా కోసి, అదె మోడ్రెన్ బ్రెడ్ ముక్కల్లా చేసి వాటిని నున్నగా అరగతీసి అమ్ముతరనివిన్న" అంది కాకి.

"అట్లనా. గుట్టకు గుట్టె కతం అయ్యిందే" అంది పిచ్చుక చుట్టు చూస్తూ.

"మనుషులు తలుచుకుంటె ఏదైనా మరాషేకదా?"

"ఎటువెళ్ళినా గుట్టను చూసుకుంటూ ఊరు చేరేదాన్ని ఇప్పుడు ఆ అవకాశం

లేకుంటా పోయింది. తోవతప్పకుండా గుట్టలు, బోల్లు మనకో ఆధారంగా వుండేవి కొన్ని రోజులైతే ఇప్పుడున్న గుట్టలన్ని మాయమైతయి" అంది పిచ్చుక.

"అంతే వున్నట్టుంది. మనిషి మాయగాడు డబ్బులకోసం ఏదైనా చేస్తడు" అంది పిచ్చుక.

"మనదేశపు గుట్టలన్నింటిని వేరే దేశాలకు పంపి, సంచులకొద్ది డబ్బును తెచ్చుకుంటరట'' అని అనుకుంట గుట్టలను గుర్తును చూసుకుంటు ముందుకుసాగినయి.

కొంతదూరం వెళ్లగా పిచ్చుకకు దప్పికైంది. "ఆ పక్కన వాగుండాలి నీళ్ళు తాగుదాం పద స్వామి" అంది.

"వాగులో నీళ్ళు ఉన్నాయో లేవో" అంది కాకి మౌనంగా చూస్తూ

"ఎందువల్ల. ఆ వాగులో ఎప్పుడు నీళ్ళుండేదే. కాకపోతే కాసింత ఇసుకను తవ్వుదాం. మనం తవ్వాల్సిన అవసరం కూడా ఉండదనుకుంట. ఈ పాటికి పశువుల కాపరులు చెలిమలు తవ్వినాలె" అంది పిచ్చుక.

"అది ఒకప్పటి మాట. నేను ఆ మన్ననే చూసాను. వాగు వాగులాగలేదు. ఓ వఱ్ఱెలాగైంది" అంది.

'అట్లనా ఎందువల్ల' అన్నట్టు చూసింది పిచ్చుక.

"గుట్ట కరిగినట్టె వాగుకూడా" అనేలోపే

"అంటె, అదెట్లా" అంది పిచ్చుక.

"ఎట్లేంది. వాగులోని ఇసుకనంత పట్టణాలకు మోస్తుంఁడ్రు. అందువల్ల వాగులు వఱ్ఱెలైనయి" అంది కాకి విచారంగా.

"తడిలేని వాగు వడ్డెమ్మటి తంగెడి చెట్లు కూడా మొలవటం లేదు. తడిలేకున్నా బతికె మోదుగులు, కంపచెట్లున్నాయి అంతే మునుపటి వలె పచ్చని చెట్లు రంగురంగుల పూలు, కాయలు లేనే లేవు. ఇట్లా చెట్లు పెరగకపోవడానికి మేకలు కూడ కొంత కారణం గద. అవి చెట్లు చేమలను పెరగనీయవు" అంది.

"అందుకే ఊర్లు ఊళ్ళలాగవుండటం లేదు" అంది పిచ్చుక.

"ఎటు చూసినా రాళ్ళు-బోళ్ళు. చెట్లుచేమలు లేనేలేవు. అక్కడక్కడ కొన్ని తాడి చెట్లు తప్పా."

'అవునన్నట్లుగా' తలాడించింది పిచ్చుక.

"అందుకే వానలు కురవటం లేదు. అన్నీటికి ఈ కరువు వొచ్చింది" అంది కాకి.

"నాకో కథ గుర్తొస్తుంది" అంది పిచ్చుక.

"వస్తది వస్తది పిట్ట కథలని ఊర్కెనే అంటరా".

"సరే పోనీ స్వామి, ఏది జొన్నచేను కనపడడం లేదు" అని అడిగింది పిచ్చుక.

"అది ఏనాడో ఎండిపోయింది" అంది కాకి.

"అదిగో ఆ చెలుకలంత కంపచెట్లు మొలిచినయి ఎట్లున్నయి చూడు పచ్చగ" అంది కాకి.

"అవును స్వామి నాకర్థంగాక అడుగుత, ఈ కంపచెట్లు ఎందుకు ఎండిపోవో".

"అవి బయటి దేశపు విత్తనాలు. అంత తొందరగా ఎండవు కాని పేద జనం వాటిని నరికి, బొగ్గులుగ కాల్చి పొట్ట పోసుకుంటున్నరు" అంది కాకి.

"పొద్దు కూకుతుంది, ఈ బర్రెగొడ్లు ఊరివైపే పోతున్నాయి వాటి మీద కూర్చోని పోదామా తిరిగి తిరిగి అలిసినట్లుంది".

"పద" అంటు పిచ్చుక, కాకి వెళ్లి ఓ ముసలి బర్రెమీద వాలినయి.

"అవును, ఆవులు, కోడెలు, ఎడ్లు ఎక్కువ కనిపించడం లేదు ఎందుకో" అంది పిచ్చుక.

"రోజురోజు వాటి అవసరం లేకుండా పోతుంది. ట్రాక్టర్లొచ్చి నాగండ్లు దున్నడం, ధాన్యాన్ని వస్తువులను చేరవేయడం. అవే అన్ని పనులు చేయడం వల్లా నాగండ్లు లేవు బండ్లూ లేవు. కనుక తెల్ల పశువులు తగ్గిపోతున్నయి" అంది కాకి.

ఆ ఎదురుగా నలుగురు గుండ్ల చాటుకు కూర్చున్నరు. వూళ్ళో నుండి ఒక వ్యక్తి సైకిల్ మీద వస్తున్నాడు. దగ్గరికి రాగానే గుండ్లచాటుకు కూర్చున్న నలుగురు ఒకేసారి అతనిపైబడి సైకిల్ కిందపడేశారు. బొడ్లోని కత్తులను తీసి అతన్ని ఎక్కడబడితే అక్కడ నలుగురు నాలుగు పోట్లు పొడిచారు. అంతె అతను 'అమ్మా' అంటు నేలకు ఒరిగాడు. అక్కడంతా రక్తం మడుగైంది. అదిచూసి బర్లమ్మటి వొచ్చేటోళ్లు వెనకకు పరుగుదీసారు. ఆ నలుగురు తమ తమ కత్తులను తంగెడు ఆకులతో తుడిచి మళ్లి బొడ్లో పెట్టుకుని ఏమి ఎరుగనట్టు పక్కపొదల్లోకి తప్పుకున్నారు.

కాకి పిచ్చుకకు కాళ్ళు రెక్కలు వణుకగా ఎగిరి ఊరివైపు వేగంగా పోయినయి.

00

నీరెండలో లేతగడ్డి చిగుల్లని మేస్తుంది ఓ తెల్లని పావురం.

అది చూసిన కాకి వెళ్లి ఎదురుగా నిలుచుని పావురాన్ని పలకరించింది.

"ఎక్కడనుంచి రాక, అక్కడంతా బాగున్నారా" అంది కాకి.

"హైద్రాబాద్ నుండి, పోయినోళ్లు పోంగ వున్నోళ్ళు అట్లా వున్నరు. అక్కడ ఓ పూట ప్రశాంతం మరోపూట అలజడి ఎప్పుడు ఏదో గొడవ" అంది పావురం.

"ఎందుకట్ల" అని అడిగింది పిచ్చుక.

"ఏముంది ఈ మనుషులు ఒకర్నొకరు నమ్మరు. ఒకప్పుడు కత్తులు కఠార్లు వాడేది. ఇప్పుడైతే బాంబులు పిస్తోళ్ళు. చూడడానికి బాగానేవుంటరు, కన్ను మూసికన్ను తెరిచేలోపల హత్య జరిగిపోతూనే వుంటుంది. అక్కడక్కడ దుకాణాలు తగులబెట్టడం, సరుకులు దోయడం జరుగుతూనే వుంటయి. ఈ మధ్య మరీ

ఎక్కువైంది" అంది పావురం.

"నేను అంటేకాకిగోల అంటారు కాని బయటినుండి వచ్చినోల్లే బద్మాసి పనులు చేస్తారట" అంది కాకి.

"అందరు కందిరీగ కొడుకులు" కందిరీగ ఎందుకు కరుస్తదో తెలియదు. కరుసుతూనే వుంటుంది. అట్లాగే వాళ్ల అమాయకులను చంపుతరు వాళ్లకేమొస్తదో తెలియదు. మరీ పాత బస్తీ అయితే చెప్పలేకుంట వుంది. పాతబస్తీ అనే దానికంటె పరేషాన్ బస్తీ అంటె సరిపోతుంది. కర్ఫ్యూ పెట్టు, కళ్ళల్లో వొత్తులు పెట్టుకో జరిగేయి జరుగుతూనే వుంటయి. ఒక్క బస్తీల పుట్టి, ఒక్క చోట పెరిగినోళ్ళు ఒకరిమీద ఒకరు కచ్చెలు పెంచుకుంటరు, కత్తులు దూసుకుంటరు" అంది పావురం బాధగా చూస్తూ.

"కాని మీకు మొక్కాలమ్మా మనుషులకంటె మీరే నయం. మసీదులో స్థావరం, మందిరంలో స్థావరం. పొద్దంతా కల్సితిరుగుతరు, కలిసితింటరు. తన్నుకునేది లేదు. నీవు గుడిలో వుండే పావురం, నీవు మసీదులో వుండే పావురం అని ఎవరు వేలు పెట్టిచూపరు. అదె అందులోకి వెళ్ళే మనిషి ఇందులోకి, ఇందులోకి వెళ్ళే మనిషి అందులోకి వెళ్లేనా రక్తం చిందవల్సిందే. అంటే బుద్ధి జీవులకంటే పక్షులే నయం. అవి అన్నీ కల్సి తిరుగుతున్నయి. అన్నీ కలిసి తింటున్నయి" అంది కాకి.

"వుంటున్నది వాస్తవమే కాని జనాన్ని చూస్తుంటే బిక్కు బిక్కు మనిపిస్తువుంటుంది. ఏ గుడిని ఎవడు కూలగొడతడో, ఏ మసీదును ఎవడు పడగొడతడో చెప్పలేని రోజులు ఇవి. రేడియోలో వింటనే వున్నారుగా ఎక్కడెక్కడ దేనిని కూలగొట్టేది. మీరే నయం ఏ చెట్టు మీదనో వుంటరు. మీ తెరువు ఎవరు రారు" అంది పావురం.

"అవును నిజం" అంది పిచ్చుక.

"నిజమే నిజమే నీవుండే స్థావరం అయితే మరీ సురక్షితం. తోరబోర గుహల్లో వున్నట్టు ఏగోడ పొక్కలోనో, బావుల దరిపొక్కల్లోనో ఉంటవు. ఏదన్న గింత సప్పుడు కాగానే బుర్రున లేచి పోతవు" అంది కాకి.

అవును అన్నట్టు పిచ్చుక ఓ సారి తోకను కిందికి మీదికి అని నిలుచుంది.

కొంచెం దూరంలో కోడి పుంజులు రెండు తలలు నిక్కపొడుచుకొని ఎగిరెగిరి తన్నుకుంటున్నయి. రెండింటిలో ఏదో ఒకటి చస్తేగాని విడిపోనట్టున్నయి. వాటికి అంత విరోధం ఎందుకొచ్చిందో. కారణం లేకుంటా కత్తులు దూసుకోవటం ఇదేనన్న మాట.

"వాటి కొట్లాటను చూస్తుంటే పాత బస్తీ గుర్తొస్తుంది" అంది పావురం.

"అంతేనంటవవా" అంది కాకి.

"అప్పుడే అక్కడికొచ్చిన ఊరకుక్క వాటి వెంటబడి తరిమి విడిపించింది.

అక్కడేవున్న నాలుగు కోడి పెట్టలు అది చూసి బెదిరి, క్కోక్కో అంటున్నాయి కాని దేనిని ఏమి అనటం లేదు. ఇళ్ళలో ఉండే ఆడవాళ్ళ లాగా.

00

ఊళ్లోని కూలినాలి జనం వారం రోజులనుండి ఆ వూరికి మట్టిరోడ్డు వేస్తున్నారు. పని ముమ్మరంగా సాగుతుంది. అధికారులు నాయకులు వచ్చి చూసి వెలుతువున్నారు. పనికి ఆహారం పథకం కింద ఈ రోడ్డు వేస్తున్నారు. రోడ్డు మొదలు పెట్టిన రోజునుండి జనం కూపన్లు అడుగుతువున్నారు. పనిచేసిన ప్రతి వ్యక్తికి రోజుకో కూపను ఇస్తారు. డీలరు కూపనుమీద బియ్యాన్ని ఇస్తాడు. సాయంత్రం వరకు కూపన్లు పంచుతారు. అని అందరు అనుకుంటుంటె పిచ్చుక విని కాకితో "అయితే డీలరు ఇంటిముందు ఈ రోజు బియ్యపు లారి దిగుతదన్నమాట" అంది విప్పారిన ముఖంతో.

"అంతే కదా ఇక మనకు పండగే పండుగ" అంది పిచ్చుక. మళ్ళీ తానే తోకను కిందికి మీదికి అంటూ.

తీరా సాయంత్రం పనిచేయించే వ్యక్తి సైకిల్‌మీద వచ్చాడు అందరికి కూపన్లు పంచాడు. వాళ్ళ వాళ్ళ సంతకాలు తీసుకున్నాడు. వాళ్ళు డీలర్ దగ్గరికి వెళ్లేముందు ఓ మాట చెప్పాడు. "ఈ కూపన్లు తీసుకుని డీలర్ బియ్యం ఇవ్వాలి. కాని డీలర్ దగ్గర బియ్యం లేవు. మన ఊరికి వచ్చిన బియ్యం ముక్కి పోయినయిట".

ముక్కితే ఏమైతది బుక్కడానికి అనుకున్నయి పక్షులు.

"ముక్కిన బియ్యం ఎట్ల తింటం" అన్నారు కూలీలు.

"అందుకని వాటిని అక్కడే అమ్మి డబ్బులు తెచ్చాను తీసుకోండి" అంటు సంచిలో నుండి రూపాయలను తీసి, లెక్కచేసి ఒక్కొక్కరికి ఇచ్చాడు. ఇదంతా చేసినందుకు తాను కొంత కోసుకున్నాడు. రొట్టెని కంటె తుంపలోడె మెరుగు అన్న సామెతను గుర్తు చేశాడు.

ఈ పైసలు పంపకం చూసి కాకి, పిచ్చుక నిట్టూర్చుతూ అక్కడినుండి ఎగిరిపోయి ఓ సారి డీలరు ఇంటివైపు తొంగిచూశాయి. ఇందాక డబ్బు పంచిన వ్యక్తి డీలర్‌కు పోవలసిన కమీషన్ను అప్పచెప్పుతున్నడు.

అదంతా చూసిన కాకి "పేదల కోసం ఏ మంచి పనిని మొదలుపెట్టి దానిని దారిమళ్ళిస్తూ, దక్కవల్సిన వాళ్ళకు దక్కకుండా చేస్తరు" అంది కాకి.

"మనం పొద్దున బడి దగ్గర వాలినపుడు, పంతులు పిల్లలకు "మనం పూర్వం కోతుల సంతతికి సంబంధించిన వాళ్ళం అన్నాడు గుర్తుందా?" అని అడిగింది పిచ్చుక.

"ఆ, అవును" అంది కాకి.

"కోతి ఏదన్న దొరికినపుడు దబా, దబా తింటూ గొంతు పక్క తిత్తిలో

దాచుకుంటుంది. మరో ప్రాణి ఎక్కడ అంతా తింటదో అని దాని ఆరాటం. అందుకేనేమో వాటి సంతతి అయిన మనుషులు ఏదైనా అవకాశం వస్తె దొరికనంత దోచేస్తారు" అంది పిచ్చుక.

"మనమే నయం ఆ పూట ఎల్లితే చాలు. దాచుకునేది లేదు దోచుకునేది లేదు" అంది కాకి.

00

"నాకో కత గుర్తొస్తుంది" అంది పిచ్చుక.

"సరె చెప్పు ఏం కతో" అంది కాకి.

"అవును నీవు ఎప్పుడైనా అద్దంలో చూసుకున్నావా స్వామి" అని అడిగింది.

లేదు అన్నట్టు తల అడ్డంగా ఆడించింది కాకి.

"చూసుకున్న ఏం కనపడతదని, ఒళ్ళు నల్లగ మొఖం నల్లగ, ముక్కు నల్లగ కండ్లు నల్లగనేనాయె" అంది పిచ్చుక.

"ముందు కత చెప్పేదువు" అంది కాకి.

"కోప్పడకు స్వామి, ఉన్నమాటంటె ఉలుకెందుకు, నీకంటె నల్లగున్నవారు మరొకరున్నారు" అంది పిచ్చుక.

"ఎవరు"

"గబ్బిలం"

"నేను అంత నల్లగున్ననా" అంటు తన్నబోయింది కాకి.

"అసలు కత చెప్పు"

"నేను ఓ ఇంటి వసారలో వాలిన. అక్కడ గోడకు అద్దం వేలాడుతుంది. నేను వెళ్ళి అద్దం ముందు కూర్చున్న ఎదురుగ నాలాంటిది మరోటి. రూపు రేఖ అన్నీ నా తీరే. అనుమానం వచ్చి పొడిచి చూసిన, అది పొడిచింది. నేను కిచకిచ అరిచిన అది అరిసినట్టు అనిపించింది" అంది.

"శబ్దం వినిపించిందా" అడిగింది కాకి.

"పిట్ట తెలివిగాని అద్దంలో వున్నది నీ రూపమె, అరిచినట్టు హావభావాలు కనిపిస్తాయి కాని శబ్దం ఎట్లా వినిపిస్తదే పిచ్చిమొఖమా" అంది కాకి.

"ఓ అక్షరం మింగేసినవు. పిచ్చి మొఖంకాదు పిచ్చుక ముఖమా అను" నవ్వు ముఖంతో అంది.

"ఏడిశావు చెప్పేదేదో చెప్పిచావు" అంది కాకి.

"ఏం లేదు అద్దంలో చూసుకుంటె చాలా అందంగా, ముద్దుగా పొంకంగా వున్నాను" తృప్తిగా అంది పిచ్చుక.

"ఆ వున్నావు, వుంటె ఏమైంది" కొంచెం విసుగ్గా మొఖం పెడుతూ.

"నాకు నేనే మురిసిన" సంతోషంగా చూస్తూ అంది.


కథా నిలయం
5276

"అయితే" ఓపిక తగ్గిన చూపుతో

"ఆ నవ్వు విని, కిచకిచమని రానే వచ్చె" అంటు సిగ్గుగా తలవంచుకుంది.

"దొరికితే వదులుతదా అదేమి పిట్ట. మగపిట్ట"

"వదిలేదెక్కడిది చుట్టు తిరుగుడు ఒళ్ళు అలిసే వరకు ముఖంలో ముఖం పెట్టుడు"

"ఇంటోళ్ళు చూసి లేవగొట్టలేదా"

"లేదు మమ్ములను చూసి వాళ్ళూ తలుపేసుకున్నరు" అంది నవ్వు ముఖంతో

"మీరు నయమే, మనుషులూ నయమే. మాకు వచ్చింది చావు. ఎవరికంట పడకుండా ఎప్పుడో ఎక్కడో మిడకాలి" అని గునిచింది కాకి.

"మేము కలుసుకున్నప్పుడు ఎవరు చూసినా గండమట. ఆ అరిష్టం పోవటానికి ఆ చూసినవాళ్ళ చావు కబురు చుట్టాలకు పంపాలట" అంది కాకి మళ్లీ తానె.

"అప్పుడు ఎవరికి ఏం కాదన్న మాట" అంది పిచ్చుక ముగింపుగా.

"అవును. ఈ కతలో ఏముందని చెప్పినట్టు" అడిగింది కాకి.

"ఏం లేదు. మమ్ముల చూసి మనుషులు గూద?" అని అంది పిచ్చుక.

00

"వళ్ళంతా నొప్పులుగా ఉంది, కళ్ళపొంటి నీరు కారుతూ వుంది" అంది పిచ్చుక ఆయాసంగా ఊపిరి పీలుస్తూ.

"ఉండదు మరి, మనం పీల్చేగాలి, తాగేనీరు, తిరిగే భూమి అంతటా కాలుష్యమేనాయె ఎక్కడ కాలుపెట్టు అంతట ప్లాస్టిక్ మయమే. అంతట ప్లాస్టిక్ సంచులే. ప్రతి దానిని ప్లాస్టిక్ డబ్బాలోనే ప్యాక్. వాటిని వాడిపారేస్తే అంతటా ప్లాస్టికే. ఇంతకుముందు మంచినీళ్ళను కుండలతో బిందెలలోను తెచ్చేవారు. వాటిని నింపిపెట్టినపుడో, తెచ్చి దించినపుడో మనం ఓ గుక్కెడు మింగేవాళ్ళం. ఇప్పుడు క్యానయినంక మూత పెట్టడమే. నీళ్ళు తాగేటట్టు లేదు. మురికి నీళ్ళు తాగితే నొప్పులు రోగాలు స్నానగదుల సబ్బు నీరు తాగితే వాంతులు విరోచనాలు. ఏం చెప్పాలి ఎవరికి చెప్పుకోవాలి. కటికవాడు ఇంతకు ముందు మాంసాన్ని ఆకులో పెట్టి ఇచ్చేవాడు మాంసాన్ని తీసుకొని ఆకులను పారేస్తె ఎంతో కొంత చిన్న మటన్ తుంపలు ఆకులో ఉండేవి. ఆకులను పారేసినపుడు వాటిల్లో వుండే వాటిని తినేవాళ్ళం. ఇప్పుడు ప్లాస్టిక్ సంచులలో ఇవ్వటం వల్లా అట్లా కుదరటం లేదు. పోగా కొట్టి పారేసె కోడిగుడ్ల బుర్రలను ఒక్కతాడ వేసి పొడిచేసి మొక్కల మొదల్లలో వేస్తున్నారు. అవి దొరకటం లేదు. ఈ పారేసే వేస్ట్ ప్లాస్టిక్ సరంజామా అంతా అటు మట్టిలో బొంతలు కప్పినట్టు చూడదానికి అసహ్యంగా పాదం పెట్టడానికి వీలులేకుండా వుంది. ఈ పురుగుల మందు లొచ్చినంక క్రిమి కీటకాలన్ని నశించిపోయినయి. వానపాములు, కుమ్మరి పురుగుల, పెండల

పురుగుల పత్తాలేదు. అంతెందుకు ఏ రాతిని లేపినా కనిపించే ఎర్రతేల్లు కానరాకుంటా పోయినయి.

అసలు మనిషే మాయలోడు అయిండు. తన సొలతు కోసం అన్నిటిని మార్చి వేసిండు ఈ మార్పువల్లా ఊరు ఊరులాగ కాకుండా పాడుపడ్డ కొంపలాగ చేస్తు వున్నారు. అడవి నుండి ఊల్లోకి వస్తుంటే బాటకు రెండువైపులా రకరకాల చెట్లు వాటి పూలు, కాయలతో అందంగా ఉండేవి. ఎనుగు నాటితె ఎనుగులో ఎన్ని మొక్కలు, ఎన్ని తీగలు. ఇప్పుడు ఎనుగులు లేవు పానాదులు లేవు. కడీలు నాటి ముండ్ల తీగలు గుంజడం. మనిషి కదిలినా పశువు కదిలినా రక్తాలే రక్తాలు. అంతకంటే ఎక్కువ అంతటా మొలిచిన కంపచెట్లు కదలనీయవు నడవనీయవు.

పొద్దుకూకెటపుడు ఆడవాళ్ళు కలుపుకు పోయి వచ్చేటపుడు రేగు పండ్లను సప్పరిస్తో లేక గేగులను నములుకుంటో, చింత గింజలను తింటునో వస్తూ వరసైన వాళ్ళతో సరసాలు ఆడుకుంటూ వచ్చేవాళ్ళు. పడుచువాళ్ళు రాత్రి పడకమీది ముచ్చట్లు గుర్తురాగ నవ్వి మురుస్తు ఒకొరికొకరు చెప్పుకుంటు నడక సాగించే వాళ్ళు. ఇప్పుడా కలివిడి తనం కనపడకుండా పోయింది ఎందువల్లనో" దీర్ఘ ఉపన్యాసం ఇచ్చింది కాకి.

ఊరపిచ్చుక శ్రద్ధగా విని, అవును అంది విచారంగా చూస్తూ.

ఆ అవతలి ఇంటి వాళ్ళు ఏదో తగువు పెట్టుకుంటున్నారు.

"వాడు అస్సలు చదవటం లేదంటె పట్టించుకోవైతివి. గోగుచెట్టు పెరిగినట్టు పెరిగె, పెండ్లి చేయమంటే పెండ్లి చేస్తివి. ఏపని చేస్తలేదాయె తిండి తప్పదాయె ఎట్ల". అంటుంది తల్లి తండ్రితో.

"నన్నేమి చేయమంటవు. వాడు చదవాలె గాని నేను చదవనా. చదవకపోతేపోనీ వ్యాపారం చేస్త అంటే అంతో ఇంతో ఇస్తి. అవి కరిగిపాయె. నేనేమిచేతు, అది వానికుండాలి" అంటున్నాడు తండ్రి.

"మొదటినుండి లేనిది ఇప్పుడొస్తదా" అంది తల్లి.

"మరెట్ల" అన్నాడు తండ్రి.

"ఎట్లేంది, గా వేపచెట్టు కాయిచూడు" అటు చెట్టువైపు చూపింది.

"చూస్తున్న, చెట్టు, చెట్టు కొమ్మలు, కొమ్మల్లో కాకిగూడు" అన్నాడు.

"గూట్లో నిన్నమన్నటిదాక ఏముండె" అని అడిగింది.

"కాకి, కాకి పిల్లలుండె"

"మరిప్పుడు"

"రెక్కలొచ్చి ఎగిరిపోయినట్టున్నయి" అన్నాడు.

"మరి మనుషులు ఎందుకు వేరుకారు?" అంది ఏదో రహస్యం విప్పినట్టు.

"ఎందుకుకాగూడదు?" అన్నాడు చెట్టువైపే చూస్తూ.

"చెప్పొచ్చేదేమిటంటే మనల చూసి మనుషులు పాఠాలు నేర్చుకుంటున్నారు. అటు చూడు తన పిల్లను ఓదార్చడానికి, నా పేరు చెపుతుంది. చెపితే చెప్పెకాని ఆ పిల్ల చేతిలోని వస్తువును నేను ఎత్తుకపోయినట్టు అబద్ధం చెపుతుంది. విను" అంది కాకి.

పిచ్చుక అటువైపు మరలి వింటుంది.

"ఉష్ కాకెత్తుక పోయింది. దాన్ని కొడదాం ఊర్కో" అంది తల్లి సంకలోని తన బిడ్డతో.

"అవునుగదా" అంది పిచ్చుక.

"ఇట్లా చిన్నప్పటి నుండి అబద్ధాలు చెపుతువుంటారు. అట్లా చెప్పగ చెప్పగా వాళ్ళు పెద్దై అబద్ధాలు పలుకుతారు అది సంగతి. అంతేకాదు వాళ్ళకు చందమామను చూపించి, "ఈ కాస్త తిను నీకు చందమామను తెచ్చిస్తాను" అంటారు. వాళ్ళు ఆశకు తింటారు. ఆ తరువాత చందమామ వైపు చేతులు చాచుతారు. తల్లి చేసేది లేక కాకెత్తుకపోయి అక్కడ పెట్టింది. రేపు కాకి వచ్చినపుడు తెమ్మందాము. అంటు ఇంట్లోకి నడుస్తరు. చూస్తున్నవుకదా మనుషుల తీరు, వాళ్ళ మాటలు".

'అవును కదా' అన్నట్టు తల ఊపింది పిచ్చుక.

"కొట్టంలో చూడు పాలు పితికిన ఆ తల్లి తన కొడుకుతోనే నీళ్ళు తెప్పించి పాలల్లో కలుపుతుంది. రోజు పాలల్లో నీళ్ళు కలిపేది చూసిన ఆ బాబు పెద్దయినంక తాను అదే పనిచేస్తాడు కదా. అదన్నమాట కల్తీకి మూలం" అంది కాకి.

పిచ్చుక అదిచూసి నోరు తెరిచింది.

"ఇంకేమి చూసినవు నా వెంటరా" అంటు వనం వైపు తీసుకెళ్ళింది. అక్కడ ఓ గౌడు తాటి చెట్టుమీది నుండి కల్లుతీసి కింద ఉంచాడు. అతని భార్య అందులో సగం నీళ్ళు కలిపింది.

చూస్తివా ఆమె వెంటవున్న పాప చూస్తువుంది కదూ. రేపు ఆ పాప అదే పనిచేస్తుంది. అట్లా ఈ తల్లి చేసే పద్ధతి పాకిపోతుంది. అందుకే మనుషుల్లో నిజాయితి తగ్గిపోతుంది" అంది కాకి విచారంగా.

పిచ్చుక ఈ సారి నోరు తెరచి చూస్తువుంది. ఎందుకంటె పిచ్చుక ఇంతకుముందు రోజు చూస్తు వున్న అంతగా వీటిని గమనించలేదు.

"ఇదీ వీళ్ళ బండారం. అంతేకాదు అటు చూడు ఇంకా అందులో ఏదో తెల్లని పదార్థం కలుపుతుంది. ఆ పొడి కాస్త ఎక్కువైతే తాగినవాళ్ళు అంతే సంగతి" అంది కాకి.

"పావల, రూపాయికోసం మంది ప్రాణాలు తీస్తరన్నమాట" అంది పిచ్చుక విచారంగా.

"అందుకే నేను ఎప్పుడన్నా తాగాలనిపిస్తే చెట్టుమీదనె తాగుత. కిందికి

తెచ్చినంకా అసలు తాగను" అంది కాకి.

"అందుకేనీవు తెలివైన దానివని పేరొచ్చింది. నీళ్ళు అడుగున ఉంటె రాళ్లేసి పైకితెచ్చినపట నీవు తక్కువ దానివా?" అంది పిచ్చుక.

కాకి చుట్టూ చూసి కావ్, కావ్ మని అరిచింది. ఆ తరువాత అవి అక్కడినుండి ఎగిరి ఊరివైపు వెళ్లాయి. పోతూపోతూ ఓ చెట్టుకు పారిన దొండ తీగెకున్న దొండపండును తెంపుకుని నోట కరుచుకుంది. అది చూసి పిచ్చుక ఓ మాదిరిగ నవ్వింది.

"ఎందుకు నవ్వుతున్నావు!" అంది కాకి.

"కాకి ముక్కుకు దొండపండు అనే సామెత గుర్తొచ్చింది" అంది పిచ్చుక.

"ఒహో పిట్ట కొంచెం కూత ఘనం అని నీకు ఊరికే పేరురాలే" అని తాను నవ్వింది.

00

"ఓ సారి జామపండ్లు కాసెటప్పుడు గట్టువైపు వెళ్ళి జామపండ్లు తిన్న తరువాత ఓ లంబాడి తండా దగ్గర ఆగాను. పక్కనెపున్న చెలిమలో నీరుతాగిన. ఓనర్లంగ కొమ్మమీద కూర్చున్న. ఆ చెట్టుకింద ఓ స్త్రీ ఏడుస్తూ వుంది. ఆమె మొగుడు కావచ్చు. ఓ పసిపాపను మరొకరికి ఇచ్చి డబ్బులు తీసుకుంటుండు. ఏడుస్తూనే వుంది. మొదట నాకేమి అర్థం కాలేదు. కొత్త మనిషి చేతుల్లో ఆ పాప మరీ ఏడుస్తూవుంది. కాసేపటి తర్వాత ఆ కొత్త మనిషి అక్కడినుండి పాపతో వెళ్ళిపోయింది. తల్లి మాత్రం పొరలి పొరలి ఏడుస్తుంది" అని ఆగింది కాకి.

"ఏం జరిగింది" అంది పిచ్చుక తనకు తట్టక.

"ఇంకా అర్థం కాలేదా ఎంతున్న కమ్ దమాక్‌కద. ఆ దంపతులు ఆ పసిబిడ్డను అమ్ముకున్నారన్నమాట" అంది కాకి.

"ఆ పసిగుడ్డునా"

"ఆ పసిగుడ్డునే" అంది కాకి.

"ఎందుకో"

"ఎందుకో ఏంది. పేదరికాన్ని తట్టుకోలేని వీళ్ళకు డబ్బుకావాలి. అన్నీ వుండి పిల్లలులేని వాళ్ళకు పాపకావాలి. అంతే" అంది కాకి.

"ఆ తరువాత ఆ పాపను ఏం చేస్తరో" అంది పిచ్చుక.

" ఏం చేస్తరు, అవసరమున్న వాళ్ళకు ఎక్కువ డబ్బుకు అమ్మేస్తరు"

"పాపం" అంది పిచ్చుక.

"పాపం పుణ్యం ఎవరికి కావాలి, డబ్బు కావాలి డబ్బు అంతే" అంది కాకి.

పిచ్చుక కాసేపు మౌనంగా ఉంది.

"ఏమిటి అట్లా మౌనంగా వున్నావు" అడిగింది కాకి.

"ఏం లేదు మనుషులకంటే మనమే నయం అనిపిస్తుంది. మన పిల్లలను రెక్కలొచ్చినంకా వదిలేస్తం కాని వీళ్ళు అట్లా కాదే అని" అన్నది పిచ్చుక.

"మనుషులంటే ఏమనుకున్నవు పైసలకోసం ఏ పనైనా చేస్తరు. దబ్బు ఆశచూపిస్తె నిలువున మరో మనిషిని నరికి రమ్మంటే నరికొస్తరు. అది సంగతి" అంది కాకి.

"నిజమే. అప్పుడప్పుడు మా పిచ్చుకలమీద వల విసురుతరు. మేమెంత మా ప్రాణమెంత చెప్పు అందుకే పిచ్చుక మీద బ్రహ్మా అస్త్రం అన్నరు."

"అదికాదు వాళ్ళకు నీసు కావాల నీసు" అంది కాకి.

"ఏం నీసో ఏంపాడో ఒక పంటికి కూడారాని వాటిని ఎందుకు చంపుతారో. నీ సంగతి వదులు, చిన్న పరకపిల్ల ఎంతుంటది, వాటిని కూడ వదలడే మనిషి" అంది కాకి.

"సరె పశువులను, పక్షులను తినే ఈ మనిషిని ఎవ్వరు తినరు అది వాళ్ళ దుస్థితి. కాని నేను విన్నదేమిటంటే నిన్ను నరికి కాకులకు గద్దలకేయ అంటారె" అంది పిచ్చుక.

"కోపం మొచ్చినపుడు అట్ల అనడమేకాని అలా జరుగదు. నేనైతే ఎన్నడు చచ్చిన మనిషిని తినలేదు" అంది కాకి.

"చచ్చినంకా తాచుపామును కాల్చేస్తరు. ఎందుకంటే దాని కంఠంలో విషముంటుందని అట్లాగే చచ్చిన మనిషిని కాల్చుతరు. కొందరు పూడ్చుతరు ఎందుకో తెలుసా మనిషికి నిలువెల్ల విషముందనుకుంట" అంది కాకి మళ్ళీతానే.

"అసలు మనిషే విచిత్ర జీవి. ఓసారి ఏం జరిగిందంటే-

ఓ రోజు పొద్దున్నె ఓ చెత్త కుప్పదగ్గర వాలిన. ఓ గుడ్డలో మాంసపు ముద్ద చుట్టి వుంది. ఈ రోజు మంచిరోజె అనుకుని దగ్గరికి వెళ్ళిన. చుట్టూ చూసి ఆ మాంసపు ముద్దను మొదట కాళ్ళతో కదిలించిన. అంతే 'కేర్' మని అరిచింది. వొళ్ళు వణికి ఎగిరి పక్కనే వున్న పిట్టగోడ మీద కూర్చున్న" అంది కాకి.

"మనం కూర్చున్నందుకే, వాటికి పిట్టగోడ అని పేరువొచ్చినట్టుంది" అంది పిచ్చుక.

"వుండొచ్చు"

"చెప్పు, పాప కదిలి అరిచింది, ఇంకా"

"అది ఆ పూటే పుట్టిన పాప. శరీరం మీది రక్తాన్ని కూడ ఇంకా తుడచలేదు. ఆ పాప గుక్క తిప్పుకుంట ఏడుపు మొదలుపెట్టింది. ఆ ఏడుపు విన్న వచ్చిపోయేవాళ్ళు పాపదగ్గరికొచ్చి చూసి 'పాపం పసికూన' అంటున్నప్పుడే నేను ఎగిరిపోయాను".

అది సంగతి పదపోదాం అని ఊరివైపు ఎగిరిపోయినయి.

"ఈ మనుషుల కంటే మనమే నయం" అంది కాకి.

"అవును పిరికి జీవులు" అంటు ఊరువైపు చూస్తు "ఊరి బయట జనంబాగా గుమిగూడారే" అంది పిచ్చుక.

"అదే నేనూ చూస్తున్న" అంటు తీక్షణంగా చూసి.

"మనకు ఈ రోజు పండగే పద అంది" కాకి.

అట్లనా అన్నట్టు చూసింది పిచ్చుక కాకివైపు.

"మరి కుక్కలను కొడుతున్నారెందుకో"

"పితరులకు పెట్టిన పిండాకూడును కుక్కలు ముట్టొద్దని" అంది కాకి.

"పక్షి ముడితేనే మంచిదని వాళ్ళ నమ్మకం" అంది మళ్ళీతానే.

మరి మధ్యన నా సంగతి ఎందుకు తెస్తరు, ఎవ్వరు చూడు పిట్టకెయ్యాలి అంటారు" అని అడిగింది పిచ్చుక.

"పక్షికెయ్యాలి అనికూడ అంటరులే. పెద్ద బోడి" అంది కాకి తన ముక్కును అటుఇటు తిప్పుతూ.

"నేనంటలేను సామి జనం అంటారని అంటున్న" అంది పిచ్చుక.

"అవునుగాని పద" అంటు వడ్డించిన విస్తరివైపు వెళ్ళాయి.

చుట్టపక్కాలు అక్కడికొస్తున్న కుక్కలను వెనక్కుకొడుతు, పక్షి ముట్టాలి అని వంగి వంగి మొక్కుతువున్నరు. కాకి నేలవైపు వంగింది.

"ఏ సామి జాగ్రత్త ఆడేదో పొగలెలుతున్నయి."

"తెలుసు అగరొత్తులు కానొస్తలేవా. బతికున్నప్పుడు అగ్గిపుల్లను కూడ ఇవ్వని కొడుకులు సచ్చినంక ఇట్లా చేస్తరు. నేను కిందికి దిగినంక నా వెంట నీవురా" అంటు కాకి ఆ వడ్డించిన విస్తరికి కొంతదూరంలో దిగి, నడిచివెళ్ళి ఓ సారి తొంగి చూసి పక్కకు జరిగి కాసేపు చుట్టూ చూసింది. అక్కడికి కొంత దూరంలో నిలుచున్న వాళ్ళలో నుండి ఒకరిద్దరొచ్చి అక్కడెవున్న కల్లును వంచి దండంపెట్టి పక్కకు వెళ్ళారు.

అప్పుడు కాకివెళ్ళి పుల్లకు కుచ్చి కాల్చిన మాంసం ముక్కలను తన కాళ్ళ దగ్గరికి జరుపుకుంది. ఆ తరువాత మరొకసారి చుట్టూ చూసి పొడుచుకు తిన్నది.

అప్పటివరకు అక్కడ ఎదిరి చూస్తున్న జనం కదిలారు. కాకి వెనకాలె పిచ్చుక వెళ్ళి, కొన్ని మెతుకులను అందుకొని అటుఇటు చూసి తినసాగింది. అయినా కాలుతున్న అగరొత్తులను చూస్తుంటె పిచ్చుకకు కొంచెం కంపరం అనిపించి కాస్తదూరం ఎగిరి మళ్ళీ తిరిగొచ్చింది. కాకి తనకు కావలిసినయి తన్నుకొని పోయి పక్కనెవున్న చెట్టుమీద వాలింది. వెనకాలె పిచ్చుక ఎగిరిపోయి కాకిని చూసి నవ్వింది. మాంసపు ముక్కలను కాలికింద వుంచుతు "ఎందుకు నవ్వుతున్నావు" అంది.

"ఏం లేదు ఓ కవి ఓ పద్యం చెప్పాడు. అది గుర్తొచ్చింది అంతె" అంది పిచ్చుక.

"ఏం పద్యం చెప్పు"

"నీకు కోపమొస్తే" అంది పిచ్చుక బెరుకుగ.

"ఆ కవి చెప్పిందేగ నీవు చెప్పేది అంతమాత్రాన నీ మీద నాకు కోపం ఎందుకొస్తది".

'అంతేలే' అన్నట్టు తలాడించింది పిచ్చుక.

"అయితే చెప్పు" అంది కాకి.

"అదే పీయిలినెటి కాకి పిత్రుడెట్లాయెరా?" అని నాలుక కరుచుకుంది పిచ్చుక.

"ఓసి అదా, అది వేమన్న వేదం. ఈ తెలివి తక్కువ మనుషులకు కవి వేసిన ప్రశ్న అది అంతే కాని కాకుల నిందించడం కాదు. చూశావుగా విస్తరినిండా చచ్చిన వాని పేరుమీద వడ్డించి పక్షులను తినమని మొక్కుతున్నరు? అది వాళ్ళ నమ్మకం. దానిని మార్చడం కష్టం. వేమన్న వెనుకటి నుండి అంటున్నా ఇప్పటికి మారలేదంటే ఇక తెలుసుకో" అంది కాకి.

పిచ్చుక ఆలోచనలలోకి వెళ్ళింది.

"అంతెకాదు మనిషి తన మూఢనమ్మకాల వల్ల చాలా విషయాల్లో తన నోటి దగ్గరకొచ్చిన తిండిని నేలపాలు చేస్తు వస్తున్నాడు. చూసావుగా ఇందాక సారను, కల్లును నేలమీద వంచారు ఎవరు తాగినట్టు? అది వొట్టిగా తయారు కాలేదుకదా? అట్లాగే ఇంకా చాలా విషయాలలో చాలా చాలా నష్టం కలిగించే మూఢనమ్మకాలను పెంచి పోషిస్తు వస్తున్నరు. బతికినప్పుడు చీదరించుకుంటరు చచ్చినంక మొక్కుతరు. చెపుతుపోతే చాలా చాలా వుంది. అసలు ఈ మనిషే ఓ విచిత్ర జంతువు" అంది కాకి.

(2001లో అటా మూడవ బహుమతి పొందిన కథ)

• 2001